ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 128 | శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 | పేజీలు - 6 వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

### ట్రంప్ ఒత్తిడికి భారత్
## వ్యూహాత్మక నిర్ణయం

- రష్యా క్రూడాయిల్‌కు క్రమంగా బ్రేక్
- వెనిజులా ఆయిల్‌కు ప్రధాన్యం..
- ఇంధన భద్రతే భారత్ లక్ష్యం..
- మారుతున్న మార్కెట్‌కు అనుగుణంగా నిర్ణయాలు..
- అమెరికా టారిఫ్ తగ్గింపుతో ఎగుమతులకు ఊపు...



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిళ్లకు భారత్ తలొగ్గినట్టే కనిపిస్తోంది. మిత్రదేశం రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతులను తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తోంది. దానికి బదులుగా ట్రంప్ సూచనల మేరకు వెనిజులా నుంచి ముడిచమురు కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడించింది.
గురువారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... (మిగతా 2లో)



### శ్రీవారి ఆలయ పవిత్రతను
# దెబ్బతీసే కుట్రలు

- వైకాపా పాలనలో ఓ పథకం ప్రకారం దాడి..
- తప్పుచేసిన వైకాపా ఎదురుదాడికి దిగుతోంది..
- కనీస పాశ్చాత్తాపం లేకుండా విమర్శలు..
- కల్తీ నెయ్యి వినియోగంపై ఏకసభ్య కమిషన్..
- అన్ని వివరాలను కమిటీ ముందుంచుతాం..
- దేవుడి పవిత్రతను దెబ్బతీయాలనుకున్న వారిని వదలం..
- మీడియా సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగ వ్యవహారంపై ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ కమిటీ ఎదుట అన్ని నివేదికలు ఉంచుతామని తెలిపారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసే మహాకుట్రకు వైకాపా పాల్పడిందన్నారు. తిరుమల శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేలా కార్యక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. గురువారం రాజధాని అమరావతిలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు మాధవ్ తదితరులతో కలసి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. లడ్డూ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీబీఐ నివేదిక ఇచ్చిందన్నారు . ఈ విషయంలో తప్పుచేసిన 2లో

### తిరుమల లడ్డూ వ్యవహారం రాజకీయ
# మంటలు



- సీబీఐ క్లీన్‌చిట్ తర్వాత ఊహించని రాజకీయ కుదుపులు...
- గుంటూరు విజయం, ఇబ్రహీంపట్నం వైపు జగన్..
- ఫ్లెక్సీలు, ఆరోపణలు, దాడులు, పెట్రోల్ బాంబుల వరకూ..
- పడిన ప్రతి రాయీ పువ్వవుతుంది- అంబటి కుమార్తె భావోద్వేగ వ్యాఖ్యలు..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

సీబీఐ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై గత జగన్ ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇచ్చిన అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం జనసేన, భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మరో పర్యటనకు శ్రీకారం చుట్టారు. గుంటూరు పర్యటనకు లభించిన అనూహ్య స్పందనతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం నెలకొనగా, తదుపరి ఇబ్రహీంపట్నం పర్యటనకు జగన్ సిద్ధమవు తున్నారు. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ తిరుమల లడ్డూ కల్తీ జరిగిందంటూ టీడీపీ నేతలు ఊరూరా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, వాటిపై రాజకీయ ఆరోపణలు పెరగడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. మాటల యుద్ధం దాటిపోయి దాడులు, ప్రతిదాడులుగా మారి పరిస్థితి పెట్రోల్ బాంబులు విసురుకునే స్థాయికి చేరిందని (మిగతా 2లో)

### శ్రీశ్రీ పంక్తితో రాజ్యసభను
# కదిలించిన కమల్

- తొలి ప్రసంగంలోనే ప్రజాస్వామ్యంపై హెచ్చరిక..జగన్నాథ రథ చక్రాలొస్తున్నాయ్ అంటూ గళం..
- ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కుల హరణకు కుట్ర... నేరుగా ఎన్నికల సంఘంపై విమర్శలు



2లో

### వివేకా హత్యకేసులో సుప్రీం
# తుదిమాట

- సిబిఐ అదనపు దర్యాప్తుకు గ్రీన్ సిగ్నల్.. సునీత డిమాండ్లకు పరిమిత మద్దతు
- ట్రయల్ కోర్టు పరిధిలోనే విచారణకు అనుమతి.. నెలరోజుల గడువు సవరణ



2లో

# స్వచ్ఛ శ్రీశైలమే లక్ష్యం

- స్వచ్ఛ శ్రీశైలంగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం..
- ఏప్రిల్ లోపు చెత్త తొలగింపు..
- మూడు ఈ వాహనాలు అందజేత.. డోర్నాలలో ప్రాసెసింగ్ సెంటర్..
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మెన్ పట్టాభిరామ్..



**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

శ్రీశైలం పరిసర అటవీ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను ఏప్రిల్ నెలలోపే పూర్తిగా తొలగిస్తామని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హామీ ఇచ్చారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఆత్మకూరు డివిజన్ శ్రీశైలం సబ్ డివిజనల్ అటవీ అధికారి ఎం. బబిత కుమారి, నంద్యాల మునిసిపల్ (మిగతా 2లో)

# దేవుడిపై పగబట్టిన వైసీపీ

- వైసిపి హయాంలో వరుసబెట్టి దాడులు..
- సిట్ నివేదికలో వైసిపికి క్లీన్‌చిట్ ఎక్కడా...
- డి.సిఎం. పవన్ కళ్యాణ్...



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. సిట్ నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తామే (మిగతా 2లో)

### వాహనాలు అందుబాటులో వుంటే నేరాల నియంత్రణలో...
# మరింత వేగం

### పోలీస్ శాఖకు 5 వాహనాలు అందజేత



**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

సమస్య తలెత్తిన వెంటనే ఘటన స్థలాలకు చేరుకునేందుకు పుట్టపర్తి పోలీసు శాఖకు ఐదు కొత్త వాహనాలు అందాయి. పోలీసు సేవలను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన భద్రత కల్పించాలనే ఉద్దేశంతో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కలిసి రూ. 75 లక్షల వ్యయంతో ఈ వాహనాలను పోలీసు శాఖకు అందజేశారు.గురువారం శ్రీ సత్య సాయి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని పోలీసు స్టేషన్లకు ఇప్పటివరకు ఉన్న వాహనాలు పాతవిగా ఉండటంతో అత్యవసర ఘటనలకు సకాలంలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు ఆలస్యం జరిగేదని పేర్కొన్నారు.ఈ సమస్యను గుర్తించి పోలీసు శాఖ అవసరాలను ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి ఐదు వాహనాలు అందజేయడం అభినందనీయమని జిల్లా ఎస్పీ అన్నారు. నూతన వాహనాలు అందుబాటులోకి రావడంతో ఇకపై ప్రజల సమస్యలకు త్వరితగతిన స్పందించే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులు నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు.పోలీసు అధికారులు ఈ వాహనాలను సద్వినియోగం చేసుకుని సమయం వృధా కాకుండా ప్రజల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి ఇతర శాఖలకు (మిగతా 2లో)

### తక్కువ ధరలకు కొంటే
# కల్తీ జరిగినట్టా

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి పేర్ని నాని



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

కూటమి ప్రభుత్వం ముసుగులో నారా చంద్రబాబు ప్రభుత్వం ఉందని.. ఇంతకీ చంద్రబాబు, పవన్, మాధవ్, కేశవ్ ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు.. లడ్డూ వివాదంపై తాజాగా మాజీ మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేశవ్ తన ఆర్థిక శాఖ గురించి, ప్రభుత్వ అప్పుల గురించి పట్టదు. ఆ శాఖను ఆయన నడుపుతారా.. చంద్రబాబు నడుపు తారా తెలియదన్నారు.. కెమికల్స్ కలిపి ఆవు నెయ్యి కలిపారని చెప్పిన కేశవ్.. తక్కువ ధరలకు నెయ్యి కొన్నారు కాబట్టి అది కల్తీ నెయ్యి అంటున్నారన్నారు.. వారి ప్రభుత్వం లోనే హర్ష్ డెయిరీని ఇన్స్పెక్షన్ చేసి అన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని అప్రూవ్ చేశారని ఆరోపించారు. అక్టోబర్ 2018 మాకేం సంబంధం.. ఫిబ్రవరి 2019 మాకేం సంబంధం అన్నారన్నారు.. మరి మే 2019 లో కేబినెట్ ఎలా పెట్టారు? అని ప్రశ్నించారు. మీ ఆపద్ధర్మ ప్రభుత్వంలో చాలా (మిగతా 2లో)

# వికసిత్ భారత్ దిశగా

- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది..
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు ..
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం..
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు..ఓట్ బ్యాంక్ రాజకీయాలు..
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ..



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. (మిగతా 2లో)

# భారత్ వ్యూహాత్మక నిర్ణయం


(మొదటి పేజి (తరువాయి)

ఇంధన దిగుమతులపై తీసుకునే నిర్ణయాలు పూర్తిగా వాణిజ్యపరమైన అంశాలు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, దేశ అవసరాల ఆధారంగానే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి వెనిజులా నుంచి ఆయిల్ కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.
అదేవిధంగా ఇతర క్రూడాయిల్ సరఫరా దేశాలతోనూ వాణిజ్యపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇంధన రంగంలో భారత్‌కు వెనిజులా చిరకాల భాగస్వామిగా కొనసాగుతోందని గుర్తు చేశారు. వాణిజ్యం, పెట్టుబడుల పరంగా ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. 2019--20 వరకు భారత్‌కు ప్రధాన ముడిచమురు సరఫరాదారుల్లో వెనిజులా ఒకటిగా ఉండేదని, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా అప్పట్లో అక్కడి నుంచి దిగుమతులు నిలిచిపోయాయని జైస్వాల్ వివరించారు. భారత్ తన ఇంధన భద్రతా వ్యూహానికి అనుగుణంగా కొత్త క్రూడాయిల్ సరఫరాదారులతో వాణిజ్య లాభనష్టాలను అంచనా వేయడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని పునరుద్ఘాటించారు. రష్యా నుంచి చమురు దిగుమతులపై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ... మార్కెట్ పరిస్థితులు, మారుతున్న ప్రపంచ రాజకీయ--ఆర్థిక పోకడలకు అనుగుణంగా క్రూడాయిల్ వనరులను ఎంపిక చేసుకుంటామని చెప్పారు. అవసరమైతే ఇతర దేశాల నుంచీ వ్యూహాత్మక కొనుగోళ్లకు సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. ఇక అమెరికా టారిఫ్ అంశంపై స్పందించిన రణధీర్ జైస్వాల్... ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం విడుదలైన ఉమ్మడి ప్రకటనలను ప్రస్తావించారు. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులు ఇప్పుడు 18 శాతం తగ్గిన టారిఫ్‌తో అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించనున్నాయని తెలిపారు. ఈ వాణిజ్య ఒప్పందం భారత ఎగుమతులకు, ముఖ్యంగా శ్రమ ఆధారిత రంగాలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇస్తుందని వెల్లడించారు. దేశ ఆర్థిక ప్రయోజనాలే కేంద్రంగా భారత్ అన్ని అంతర్జాతీయ వాణిజ్య నిర్ణయాలు తీసుకుంటోందని జైస్వాల్ స్పష్టం చేశారు..

# శ్రీశ్రీ పంక్తితో రాజ్యసభను కదిలించిన కమల్

## జగన్నాథ రథ చక్రాల్ వస్తున్నాయ్ అంటూ రాజ్యసభలో మొదటి ప్రసంగం

న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 5 :



నటుడు, మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో చేసిన తొలి ప్రసంగంతోనే రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరలేపారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం తీరును, ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నేరుగా విమర్శించారు. అయితే ఈ ప్రసంగానికి ప్రత్యేకమైన బలం ఇచ్చింది మాత్రం తెలుగు మహాకవి శ్రీశ్రీ కవిత్వమే. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ప్రమాదాలను వివరించే క్రమంలో కమల్ హాసన్, “జగన్నాథ రథచక్రాలొస్తున్నాయ్... వస్తున్నాయ్...” అంటూ శ్రీశ్రీ కవితలోని పంక్తిని సభలో చదివారు. తానేమి మాట్లాడుతున్నానో తెలుగు వారికి అర్థమవుతుందని స్పష్టం చేశారు. ఈ ఒక్క పంక్తితోనే ఆయన ప్రసంగం రాజకీయ విమర్శ స్థాయిని దాటి, ప్రజాస్వామ్యంపై గట్టి హెచ్చరికగా మారింది. ఎస్ఐఆర్ అమలుతో తమిళనాడులో సుమారు కోటి మంది ఓటర్లు జీవించి ఉండగానే ఓటుహక్కు కోల్పోయే పరిస్థితి తలెత్తవచ్చని కమల్ హాసన్ హెచ్చరించారు. స్పెల్లింగ్ లోపాలు, చిరునామా తప్పులు అనే కారణాలతో ఓటర్లను జాబితాల నుంచి ఏకపక్షంగా తొలగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇది ప్రజల మౌలిక హక్కైన ఓటుహక్కును హరించే చర్యగా ఆయన అభివర్ణించారు. బిహార్‌లో ఇప్పటికే అమలైన ఎస్ఐఆర్‌ను ఉదాహరణగా ప్రస్తావించిన కమల్ హాసన్, ఆ రాష్ట్రం “జీవచ్ఛవాల భూమి”గా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అలాంటి పరిస్థితి దేశవ్యాప్తంగా విస్తరించకూడదని హెచ్చరిస్తూ, ఈ మొత్తం ప్రక్రియకు ఎన్నికల సంఘమే సహకరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సంస్థే ప్రజాస్వామ్య హక్కులను హరించే దిశగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ సర్వేకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని కమల్ హాసన్ ప్రకటించారు. ఇది కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదని, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన తీవ్రమైన సమస్యగా ఆయన అభిప్రాయపడ్డారు. ప్రసంగంలో ఎన్నికల సంఘం తీరుపై ఘాటుగా స్పందించిన కమల్ హాసన్, “అక్షర దోషాలు భాషలకు మాత్రమే శాపం. ఆధునిక సాహిత్యం, ఇంటర్నెట్ వాటిని పట్టించుకోవు. కానీ ఎన్నికల సంఘం మాత్రం అలా కాదు” అని వ్యాఖ్యానించారు. “ఈసీ అంటే ఇంగ్లిష్ కోచెస్ కాదు” అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన ఆయన, సహకారం లేకపోతే ఫలితంగా సగం ఉడికిన, అసంపూర్తిగా మిగిలిపోయిన ఎన్నికల ప్రక్రియ మాత్రమే మిగులుతుందని హెచ్చరించారు. ప్రసంగానికి ముగింపు పలికే సమయంలో మరోసారి శ్రీశ్రీ కవిత్వాన్ని ఉటంకించిన కమల్ హాసన్, “జగన్నాథ రథ చక్రాలొస్తున్నాయ్... వస్తున్నాయ్...” అంటూ ప్రజాస్వామ్య రథాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. భారతదేశమనే ప్రజాస్వామ్య రథం ముందుకు సాగుతూనే ఉంటుందని, ప్రజాస్వామ్య శక్తితో దాన్ని నడిపిద్దామని పిలుపునిచ్చారు. ఎవరూ శాశ్వతం కాదని, ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా ఉండాలనే లక్ష్యంతో వ్యవహరించకూడదని అన్నారు. ప్రపంచ చరిత్రలో అలాంటి ప్రభుత్వం ఎప్పుడూ నిలబడలేదని గుర్తుచేశారు. “పిల్లలు చూస్తున్నారు... జెన్ జెడ్ చూస్తోంది” అంటూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని కమల్ హాసన్ వ్యాఖ్యానించారు. తొలి ప్రసంగంతోనే రాజ్యసభలో బలమైన ప్రజాస్వామ్య స్వరాన్ని వినిపించిన కమల్ హాసన్, రాజకీయంగా కొత్త చర్చకు నాంది పలికారు.

# స్వచ్ఛ శ్రీశైలమే లక్ష్యం

(మొదటి పేజి (తరువాయి)

కమిషనర్ ఎం. శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి గురువారం ఆయన శ్రీశైలం సమీపంలోని అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ పేరుకుపోయిన చెత్త వల్ల అటవీ సంపదకు, పర్యావరణానికి కలిగే నష్టాలను అటవీ అధికారులు చైర్మన్‌కు వివరించగా, స్పందించిన పట్టాభిరామ్ ఈ చెత్త మొత్తాన్ని ఏప్రిల్ నాటికి పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శ్రీశైలాన్ని స్వచ్ఛ శ్రీశైలంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరిస్తారని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, బోర్డు సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ఇతర అధికారులతో పట్టాభిరామ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలంలోని పారిశుద్ధ్య సమస్యలు, చెత్త నిర్వహణ, స్వచ్ఛ శ్రీశైలం కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. చెత్త సేకరణకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ తరపున మూడు ఎలక్ట్రిక్ వాహనాలను అందజేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. శ్రీశైలంలో రోజుకు సగటున 16 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, దానిని శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడానికి సమీపంలోని దోర్నాలలో ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అనుకూలమని పట్టాభిరామ్ సూచించారు. అక్కడ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొంటూ, ఆ కేంద్రం నిర్వహణకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుని తెలియజేస్తామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. శ్రీశైలంలో చెత్త ఎక్కువగా ఉత్పత్తి చేసే హోటల్స్, సత్రాలు తదితర సంస్థల ప్రతినిధులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, తడిచెత్త, పొడి చెత్త వేరు చేయడం, చెత్త నిర్వహణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తామని పట్టాభిరామ్ చెప్పారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం ఉదయం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితులు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పట్టాభిరామ్‌కు అందజేశారు.

# నేరాల నియంత్రణలో మరింత వేగం

(మొదటి పేజి (తరువాయి)



సమాచారం ఇచ్చేలా పనిచేస్తే గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఇరవై నాలుగు గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా పోలీసులు అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. నూతన వాహనాల వల్ల పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని, ఏ చిన్న ఘటన జరిగినా తక్షణమే స్పందించే పరిస్థితి ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ అందిస్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పోలీసు వ్యవస్థ అత్యంత కీలకమైనదని, ప్రమాదాలు, గొడవలు, ఉత్సవాలు ఏవైనా జరిగినా ముందుండి పనిచేసేది పోలీసులేనని అన్నారు. జిల్లా ప్రశాంతంగా కొనసాగడంలో పోలీసుల కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు వాహనాల సమకూర్పుకు సహకరించిన దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పవిత్రతను దెబ్బ తీసే కుట్రలు

(మొదటి పేజి (తరువాయి)

వారిని వదిలే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తప్పులు చేసి.. తమపై ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. దుర్మార్గాలు చేసి తిరిగి తమపై ఎదురుదాడి చేస్తున్నారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా ఏపీ సీఎం ఎండగట్టారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు.. భక్తులు తిరుమలకు రావాలంటేనే అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ వాళ్లు.. తనతోనే కాకుండా దేవుడితోనూ పెట్టుకున్నారని తెలిపారు. వైఎస్ జగన్ అన్యమతస్థుడు కావచ్చు.. కానీ డిక్లరేషన్ ఇచ్చి ఆయన దర్శనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. శ్రీవారిపై జగన్‌కు నమ్మకం ఉంటే డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. దేవుడి పవిత్రత దెబ్బతీసేందుకే లడ్డూలో రసాయనాలు కలిపారని విమర్శించారు. రసాయనాలు కలిపారని సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని స్పష్టం చేశారు. ఈ మహాపాపంపై వైసీపీ నేతలు క్షమాపణలు చెప్పారా? అని సీఎం ప్రశ్నించారు. ఈ మహాపాపంపై ప్రతి ఒక్కరూ చర్చించాలన్నారు. మాపైనే ఎదురుదాడి చేస్తారా? మీకు ఈ ధైర్యం ఎవరిచ్చారు?’ అంటూ వైసీపీ నేతలను సీఎం చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. ’పరకామణి కేసును సెటిల్‌మెంట్ చేసి సమర్థిస్తారా?’ అని వైసీపీ అగ్రనేతల వైఖరిని చంద్రబాబు తప్పుబట్టారు. అలాగే దొంగతనం చేసిన వారిని సమర్థిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వేంకటేశ్వర స్వామిపై దాడేనని ఆయన అభివర్ణించారు. ’మహా పాపం చేశారు.. క్షమాపణలు చెప్పాలి’ అంటూ వైసీపీ నేతలను డిమాండ్ చేశారు. తప్పు చేసినవారికి దేవుడు ఎలాంటి శిక్ష వేస్తాడో మీరే చూస్తారన్నారు ముఖ్యమంత్రి. దేవుడి పవిత్రతను దెబ్బతీయాలనుకునే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. దోషులను కచ్చితంగా శిక్షిస్తామన్నారు. దేవుడి పవిత్రతను కాపాడలేనంత అసమర్థులం కాదన్న చంద్రబాబు.. కూటమి నేతలు ఎక్కడైనా బూతులు మాట్లాడారా? అని ప్రశ్నించారు. ఇప్పటికీ వైసీపీ నేతలు బూతులు మాట్లాడుతూనే ఉన్నారంటూ మండిపడ్డారు. ఇక.. తిరుమలలో ఇటీవల కొన్ని అపచారాలు జరిగాయని చంద్రబాబు అన్నారు. లడ్డూ కల్తీ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. 2003లో తనపై హత్యాయత్నం జరిగితే శ్రీవారే కాపాడారని.. అలాగే గతంలో ఏడుకొండలు కాదు.. రెండు కొండలని మాట్లాడారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు. వైసీపీ పాలనలో వారి ప్రవర్తన పరాకాష్ఠకు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామతీర్థంలో రాముడి తల తీసేశారని.. ప్రశ్నిస్తే తనపై కేసు పెట్టారని చెప్పారు. అంతర్వేది, దుర్గగుడిలో దుర్మార్గాలపై చర్యలు తీసుకోలేదని వివరించారు. మరోవైపు 2022లో రిపోర్ట్‌లో కల్తీ జరుగుతోందంటే.. ఆ నివేదికను కావాలనే తొక్కి పెట్టారని ముఖ్యమంత్రి చెప్పారు. తాను సీఎం కాగానే తిరుమల. తిరుపతి దేవస్థానం ప్రక్షాళన ప్రారంభించానని వివరించారు. నెయ్యిలో పొరపాట్లు జరుగుతున్నాయని శాంపిల్స్ నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకి పంపామన్నారు. వైసీపీ తప్పుచేసి తిరిగి మమ్మల్నే క్షమాపణలు చెప్పమంటున్నారని పేర్కొన్నారు. బూతులు తిడితే నోరుమూసుకుని కూర్చోవాలంటున్నారంటూ వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరును ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపానేతలు బుకాయిస్తే వాస్తవాలు మారతాయా అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. దౌర్జన్యం, రౌడీయిజం చేస్తే సహించబోనని చెప్పారు. దేవుడితో పెట్టుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తప్పుచేసి దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మాపై వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. బూతులు తిట్టినా మేం భరించాలా? దోషులను అన్ని విధాలుగా శిక్షిస్తాం. ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని సీబీఐ మాకు ఓ నివేదిక పంపింది. ఏక సభ్య కమిషన్ వేసి అన్నీ పరిశీలిస్తాం. అవసరమైతే కోర్టులో కూడా అదనపు సమాచారం చేరుస్తాం. ఇది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశం. ఇంతవరకు చరిత్రలో వెంకన్నస్వామి జోలికి ఎవరూ రాలేదు. దేవుడికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాల్సిన బాధ్యత మనపై ఉంది. అపవిత్రం జరిగినప్పుడు భగవంతుడే ప్రజలను సమాయత్తం చేస్తారు. మీరు చేసిన పని దుర్మార్గమైన అపచారం అని చంద్రబాబు అన్నారు.

# దేవుడిపై పగబట్టిన వైసీపీ

(మొదటి పేజి (తరువాయి)

అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ధి కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడు కొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు. నెయ్యి కల్తీ అంశంలో మతాల ప్రస్తావన లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ’తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారు. శ్రీవారి విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారు. సిట్ రిపోర్ట్ ఎక్కడా వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు. రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది. భగవంతుడితో పెట్టుకున్నవారు సర్వనాశనం అయిపోతారు తప్ప బతికున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలి. భగవంతుడికి మొకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టం. హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరం. 2022లోనే కల్తీ నిర్ధారణ అయ్యింది. అయినా అయోధ్యకు అవే కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారు’ అని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ’అన్ని నివేదికలు.. ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయి. ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారిస్తే, తమ వద్ద అలాంటి పరీక్ష చేసే సామర్థ్యం లేదని ఎన్డీఆర్ఐ చెప్పింది. ప్రతీమాట భక్తుల మనోభావాలు, సెంటిమెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాం. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నాం. ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవుతుందనే నిజాలు బయటపెడుతున్నాం. వైసీపీ హయాంలో పెద్దఎత్తున దేవాలయాలపై దాడులు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు’ అని పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వికసిత్ భారత్ దిశగా

(మొదటి పేజి (తరువాయి)



ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ. 30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ధి పొందారు. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# వివేకా హత్యకేసులో సుప్రీం తుదిమాట

అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :

ఏపీలో ఏడేళ్ల క్రితం జరిగిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు పూర్తయ్యిందని సీబీఐ సుప్రీంకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే. అయితే ఆ నివేదికను వ్యతిరేకిస్తూ మరికొన్ని కీలక అంశాలపై అదనపు దర్యాప్తు జరపాలంటూ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, ఈ అంశాలను ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. దీంతో సునీత హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. తన తండ్రి హత్య కేసులో సీబీఐ అనేక కీలక అంశాలను పక్కన పెట్టిందని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగలేదని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే సీబీఐ వాదనలను పరిశీలించిన ట్రయల్ కోర్టు, అన్ని అంశాలపై తిరిగి విచారణ అవసరం లేదని స్పష్టం చేస్తూ రెండు అంశాల వరకే అదనపు దర్యాప్తుకు అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన సునీతారెడ్డి మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే సీబీఐ తదుపరి దర్యాప్తు జరపాలని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు పరిధిని మించి మరింత విస్తృత దర్యాప్తుకు అనుమతి ఇవ్వలేమని తేల్చిచెప్పింది. అయితే, సీబీఐ కోర్టు విధించిన నెల రోజుల గడువును మాత్రం సవరించిన సుప్రీంకోర్టు, సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు ప్రక్రియ యథాతథంగా కొనసాగాలని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంలో సునీతకు సుప్రీంకోర్టులో పూర్తి స్థాయి ఊరట లభించనట్టుగా తుది నిర్ణయం వెలువరించింది.

# రాజకీయ మంటలు

(మొదటి పేజి (తరువాయి)

రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ ఘటనలతో రాష్ట్ర రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఈ పరిణామాల మధ్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబాబు చిన్న కుమార్తె శ్రీజ తెరమీదికి వచ్చారు. అమెరికా నుంచి విడుదల చేసిన వీడియోలో, తన తండ్రి చేసిన వ్యాఖ్యలను ఆయన ఉపసంహరించుకుని పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఇంటిపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరమైన చర్యలను ఎదుర్కొనేందుకు తమ తండ్రి సంసిద్ధతను ప్రకటించినా, తండోపతండాలుగా తరలివచ్చి ఇంటిని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సుమారు పది గంటల పాటు అంబటి రాంబాబు మాత్రమే కాకుండా తమ కుటుంబ సభ్యులు, రాజకీయాలకు సంబంధం లేని తల్లి, సోదరీమణులు, వారి పిల్లలపై కూడా బూతు పదజాలంతో దాడులు జరిగాయని శ్రీజ పేర్కొన్నారు. ఈ దాడిని ఎగ్జిక్యూట్ చేసింది ఓ డాక్టర్, కేంద్రమంత్రి అని వ్యాఖ్యానిస్తూ పరోక్షంగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉన్నత విద్యలు చదివిన వ్యక్తి తన ఆలోచనలను సరైన మార్గంలో పెట్టుకోలేకపోవడం తనకు అర్థంకాని ప్రశ్నగా మారిందని అన్నారు. అయితే దాడులకు పాల్పడ్డ వారి సంఖ్యతో పోలిస్తే, జగన్ రాక సందర్భంగా పదింతల మంది ప్రేమాభిమానాలతో తమ కుటుంబాన్ని పరామర్శించారని శ్రీజ తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామివారి అండ, జగన్ నాయకత్వం, ప్రజల ఆదరాభిమానాలు ఉన్నంత వరకు తమపై పడిన ప్రతి రాయి పువ్వుగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ పరిణామాలు ఎటు దారి తీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# తక్కువ ధరకు కొంటే కల్తీ జరిగనట్లా

(మొదటి పేజి (తరువాయి)

నిర్ణయాలు కూడా తీసుకున్నారు.. హర్ష్ ఫ్రెష్ డెయిరీ నుంచి 291 రూపాయలకు టీడీపీ కొనుగోలు చేసింది.. మరి ఇది భోలే బాబా డెయిరీనే కదా? అని నిలదీశారు. 319, 329 తప్పన్నారు.. తాము రావటానికి రెండు నెలల ముందు 291కి వాళ్ళు ఎలా కొనుగోలు చేశారని చెప్పారు.. 2014- 19 మధ్య హర్ష్ ఫ్రెష్ డెయిరీ నుంచి కొన్నారు.. మీ ప్రభుత్వం సమయంలో మీ సొంత సంస్థ హెరిటేజ్ రేట్లు ఎలా ఉన్నాయో చెప్పే ధైర్యం మీకు ఉందా? అని మాజీ మంత్రి పేర్ని నాని నిలదీశారు. ‘హెరిటేజ్ కంపెనీలో ప్రతీ ఆరు నెలలకు రేటు ఎలా ఉందో చెప్పండి.. ఎవరు అపచారం చేశారో.. ఎవరు హిందువో.. ఎవరు ఏంటో అర్థం అవుతుంది.. పవన్ ఉచ్చం.. నీచం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.. పవన్ కళ్యాణ్ ఎన్ని మతాలు మారారు.. తమ్ముడు కోటింగ్ ఇచ్చిన తర్వాత ఒక అన్నయ్య మాట్లాడారు.. సనాతన హిందువు అని చెప్పుకునే పవన్, నాగబాబుకు దేవుడంటే భయం లేదు.. భక్తి లేదు. జగన్ మీరు మా మతం జోలికి రావొద్దు అంటూ దిగజారి మాట్లాడారు.. మీ ప్రభుత్వం హయంలో పెంటపాడులో తగలబడ్డ రథం ముద్దాయిని ఇప్పటి వరకు పట్టుకున్నారా? 250 ఆలయాలు ధ్వంసం చేశారని చంద్రబాబు మాట్లాడారు.. మీ హయంలో విజయవాడలో ఎన్ని ఆలయాలు ధ్వంసం చేశారు.. ఎంత నీచంగా ఆలయాలు, గర్భ గుడుల్లో విగ్రహాలు కూడా కూల్చివేశారు.. మీరు కూలదోసిన ప్రతీ ఆలయాన్ని పునః ప్రతిష్ట జేసింది జగన్ కాదా? పవన్ కళ్యాణ్ అయోధ్యకు యానిమల్ ఫ్యాట్‌తో తయారు చేసిన లక్ష లడ్డూలు సప్లై చేశారు.. దేశం మొత్తం తినిపించారు అని నీచంగా మాట్లాడారు.. పాలకమండలి సభ్యులు మహారాష్ట్రకు చెందిన సౌరభ్ గోరా, మైహోమ్స్ రామేశ్వరరావులు నెయ్యి వారే ఇచ్చి లడ్డూలు తయారు చేయించారు.. బూట్లు వేసుకుని దేవుడికి కొబ్బరి కాయలు కొట్టి, పూజలు చేసే చంద్రబాబు.. తల్లిదండ్రులు చనిపోతే జుట్టు కూడా ఇవ్వనివాడు హిందూ ధర్మాన్ని గౌరవించేవారు.. జగన్‌ను ప్రజల ద్వారా గెలవలేక నిందించటమే పనిగా పెట్టుకున్నారు.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెడుతుంది ఎవరు.. రాజకీయాల్లో పతనానికి పరాకాష్టలా ఇవాళ చంద్రబాబు, పవన్ మాట్లాడిన మాటలు..‘ అని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

## యాప్‌ను ప్రారంభించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా

న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 5 :

ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత దిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న ’భారత్ ట్యాక్సీ’కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ. 10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందించనట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు ’సారథి’ పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
బెళుగుప్పలో కొలువైన శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం లో గురువారం సంకష్ట ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయం ప్రధాన అర్చకులు రాంబాబు స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేకంగా సంకష్ట పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా పల్లకిలో అలంకరించి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పల్లకి సేవలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


గణపతి ఆలయంలో సంకష్ట చతుర్థి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయం ప్రధాన అర్చకులు రాంబాబు స్వామి. పూజల్లో పాల్గొన్న భక్తులు

# ముగిసిన శ్రీ కామితార్థద మహాగణపతి ఆలయం వార్షికోత్సవ వేడుకలు

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
నగరంలోని పిటిసిలో ఉన్న శ్రీ కామితార్థద మహాగణపతి ఆలయం రెండవ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం ఆలయంలో శ్రీ గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ సహిత పంచామృత అభిషేకం, సహస్ర మూలక హోమం, అరుణ హోమం, మన్య సూక్త హోమాలను అర్చకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవత్సవశర్మ , ఆంజనేయులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో ఆలయంలో కొలువైన గణపతి. హోమం చేస్తున్న పండితులు

# ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

**ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డికి వినతి పత్రం..**
**ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ..**

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగస్తులకు రావలసిన పాత బకాయిలు, డిఎ, ఐఆర్, పిఆర్సి, సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధన, పాత బకాయిలు ఇవ్వలేని పక్షంలో రావలసిన బకాయిలకు గాను ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీ రాము నాయక్ , రాష్ట్ర కార్యదర్శి హను మంత్, తాలూకా అధ్యక్షుడు హర్షవర్ధన్, సెక్రటరీ వెంకట కృష్ణయ్య, అసోసియేషన్ ప్రెసిడెండ్ కృష్ణ మోహన్, వైస్ ప్రెసిడెంట్ హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు , ఉద్యోగులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డికి వినతపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

# ప్రొద్దుటూరులో రజకుల కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

**రజక సంఘం అధ్యక్షులు చెంద్రాయుడు..**

**ప్రొద్దుటూరు (తెలుగోడు), జనవరి 5 :**
ప్రొద్దుటూరు పట్టణంలో రజకుల కమ్యూనిటీ హాల్‌కు కనీసం ఒక ఎకరం స్థలాన్ని కేటాయించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గం రజక సంఘం అధ్యక్షులు చెంద్రాయుడు కోరారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గంగయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుండి తాము కమ్యూనిటీ హాల్ కోసం పోరాడుతున్నామని తెలిపారు. అయినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు విషయంలో అనుకూలంగా ఉందని, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు తగినంత స్థలాన్ని కేటాయించడంతో పాటు నిధులను కూడా అందివ్వాలని ఎమ్మెల్యే ని, తహసీల్దార్ ద్వారా ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు.ఒక ఎకరా స్థలం తమ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కోసం అందజేయాలని కోరామని ఆయన వివరించారు. రాజకీయంగా, ఆర్థికంగా తమను అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై చాలా వరకు నిరక్షరాస్యులైన రజకులకు తెలిపి అర్హత కలిగిన వారందరికీ పథకాలు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కృష్ణ, నాగరాజు, వెంకట్, శ్రీనివాసులు, సుబ్బారాయుడు, సుబ్బారావు, శేఖర్, నాగయ్య, నాగరాజు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రజక సంఘం నాయకులు

# జిల్లాలో ఉత్తమ డిప్యూటీ ఎంపీడీవోగా రెండవ స్థానంలో యాడికి

## అవార్డు అందుకున్న డిప్యూటీ ఎంపీటీవో శశికళ..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
జిల్లాలో ఉత్తమ డిప్యూటీ ఎంపీడీవోగా రెండవ స్థానంలో యాడికి నిలిచింది. ఈ మేరకు డిప్యూటీ ఎంపీటీవో శశికళ అవార్డు అందుకున్నారు. అనంతపురం జిల్లాలోనే స్వచ్ఛభారత్. స్వచ్ఛ రథం, ఇంటి పన్నులు వసూళ్లు, ఇంటి నుండి చెత్త సేకరణ తోపాటు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం అభివృద్ధి. గ్రామంలో పరిశుభ్రతపై ఉత్తమ డిప్యూటీ ఎంపీడీవోగా యాడికి మండలం శశికళకు అవార్డును పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ అడిషనల్ కమిషనర్ సుధాకర్ రావు అందజేశారు. గురువారం అనంతపురంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో అ జిల్లాలోని 31 మండలాల డిప్యూటీ ఎంపీటీవోలు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన అధికారులు ఇందులో తాడిపత్రి డిప్యూటీఎంపీటీవో రవి మొదటి స్థానం, యాడికి డిప్యూటీ ఎంపీడీవో శశికళ రెండవ స్థానంలో నిలిచారు. వీరికి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ అడిషనల్ కమీషనర్ సుధాకర్ రావు ప్రశంసా పత్రాలు అందించారు. యాడికి మండలంలోని 14 పంచాయితీలలో పరిసరాల పరిశుభ్రత. చెత్త నుండి సంపద కేంద్రాలు అభివృద్ధి. గ్రామాలలో స్వచ్ఛభారత్. స్వచ్ఛరథం. ఇంటి పన్నులు కోలాయి పన్నులు వసూలు గ్రామ పంచాయితీలు అభివృద్ధి వాటిపై జిల్లా అధికారులు ఆయా గ్రామాలలో ప్రజలకు మొబైల్ ద్వారా రోజు మీ ఇంటి వద్దకు చెత్త సేకరణ వారు వస్తున్నరా అన్న సేవలు
అందించిన యాడికి డిప్యూటీ ఎంపీడీవో శశికళ అవార్డు దక్కించుకున్నారు.
యాడికి మండలంలో ప్రతి పంచాయితీలో చెత్త నుండి సంపద తయారు కేంద్రాలు, దేవాలయాల వద్ద అందంగా పచ్చదనం నింపడంలో డిప్యూటీ ఎంపీడీవో శశికళ సహాయంతో సచివాలయ సిబ్బంది శ్రమించారు. అవార్డు రావడం పట్ల 14 పంచాయతీల s సిబ్బంది, సచివాలయ సిబ్బంది అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అందరూ ఇలాగే కష్టపడి ప్రజా సమస్యలు గ్రామాల అభివృద్ధి సహకరించి మరెన్నో అవార్డులు యాడికి మండలలానికి వస్తాయన్నారు. కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిపిఓ విజయ్ కుమార్ రెడ్డి. డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య. గుంటకల్ డిడిఓ విజయలక్ష్మి. డి డి ఓ నాగ తాయి లీల. యాడికి డిప్యూటీ ఎంపీడీవో శశికళ. తాడిపత్రి డిప్యూటీ ఎంపీడీవో రవి తోపాటు జిల్లాలోని డిప్యూటిక్ ఎంపీడీవోలు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఉత్తమ డిప్యూటీ ఎంపీటీవోగా శశికళకు అవార్డు అందిస్తున్న పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ అడిషనల్ కమిషనర్ సుధాకర్ రావు


అడిషనల్ కమిషనర్ సుధాకర్ రావుకు పూలబొకే అందిస్తున్న యాడికి డిప్యూటీ ఎంపీడీవో శశికళ . సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

# అంకంపల్లిలో అగ్నిప్రమాదం

**3 గడ్డివాములు దగ్ధం.. లక్షకు పైగా నష్టం..**

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని అంకంపల్లి గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు అదే గ్రామానికి చెందిన జంగమ గంగాధరస్వామికి చెందిన మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి దేవాలయం అర్చకుడిగా పనిచేస్తూ పాడి సంపదతో జీవనం కొనసాగిస్తుండేవాడు. పశువులకు అవసరమైన వరిగడ్డి, వేరుశనగ, పప్పు సెనగ కట్టి ని కొనుగోలు చేసి కల్లం దొడ్డిలో వేసుకున్నాడు. అయితే గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పంటుకోవడంతో వెంటనే గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వడంతో కళ్యాణదుర్గం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ఈ అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధం కావడంతో సుమారు లక్షకు పైగా నష్టం వాటిల్లుతుందని బాధితుడు గంగాధరస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు..


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


గడ్డివాములకు నిప్పంటుకోవడంతో ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

# నిలువునా ఎండిపోతున్న వేప చెట్లు!

**పర్యావరణానికి పొంచి ఉన్న మరో ముప్పు ..**
**మేల్కొనకపోతే భావితరాల మనుగడ ప్రశ్నార్థకం ..**

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
ఇప్పటికే వాహన శబ్ద పరిశ్రమల ద్వారా పెరుగుతున్న పర్యావరణ ముప్పు, మరోవైపు మనం అభివృద్ధి చెందుతున్నాం అంటూ సెల్ ఫోన్లు ఉపయోగిస్తూ సెల్ టవర్ల నిర్మాణాలతో, జనాభా పెరిగే కొద్దీ అడవులు నాశనం చేస్తూ, విలువైన ఖనిజాలు భూమి పొరల్లో ఉన్నాయని అలాగే భూమిపై ఉన్న ప్రకృతికి అనుసంధానంగాలో ఉన్న సహజత్వాన్ని కోల్పోతున్నాం. ఇప్పటికే భూమిపై ఉన్న కొన్ని జీవ చర రాసులు కనుమరుగు అయిపోయాయి అన్నది. జగమెరిగిన సత్యం. అయితే ప్రస్తుతం ప్రాణవాయువులా నిలిచే వేప చెట్లు నేడు మౌనంగా ఎండిపోతున్నాయి. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన చెట్లు ఇప్పుడు ఆకులు రాలిపోయి, మొదలు, కొమ్మలు ఎండిపోయిన దృశ్యాలు అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక చెట్టు సమస్య కాదు... ఇది రానున్న తరాల భవిష్యత్తుపై పడుతున్న ముప్పు.


వేప చెట్లు అధికంగా ఆక్సిజన్ విడుదల చేయడమే కాదు వాటి ఆకులు బెరడు మనిషికి కొంతమేర యాంటీబయాటిక్ గా పని చేస్తాయనేది ప్రజల నమ్మకం. అలాగే గాలి కాలుష్యాన్ని తగ్గించడంలో, భూగర్భ జలాలను కాపాడడంలో, జీవ వైవిధ్యాన్ని నిలుపుకోవడంలో ఈ చెట్ల పాత్ర గొప్పది. కానీ ఇటీవలి కాలంలో కొన్నిచోట్ల పుష్కలంగా నీరు ఉన్న వాటంతకు అవే ఆకులు ఎండిపోయి మరికొన్ని చోట్ల అయితే పూర్తిగాచెట్లు కూడా ఎండిపోతున్నాయి. ఇలా నశిస్తే ముందుగా ప్రభావితమయ్యేది ఆక్సిజన్ స్థాయి. ఆక్సిజన్ తగ్గితే మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శ్వాసకోశ సమస్యలు పెరుగుతాయి. మరోవైపు, చెట్లు లేకపోవడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వాతావరణ మార్పులు వేగంగా జరుగుతాయి.

ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. చెట్లు వర్షాలను ఆకర్షించే శక్తిని కలిగి ఉంటాయి. చెట్లు తగ్గిపోతే వర్షపాతం తగ్గి, సాగునీటి కొరత ఏర్పడి, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది.

పర్యావరణ నిపుణుల మాటల్లో చెప్పాలంటే ఒక చెట్టు ఎండిపోవడం అంటే వందల ప్రాణాలకు ముప్పు వచ్చినట్లే, అయినా ఇప్పటికీ మనం మేల్కొనకపోతే, భవిష్యత్తులో ప్రకృతి దెబ్బకు మనం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

ఇప్పటికైనా ప్రజలు, పాలకులు, స్థానిక సంస్థలు కలిసి చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎండిపోతున్న వేప చెట్లను కాపాడటం అంటే మన శ్వాసను, మన ఆహారాన్ని, మన రేపటిని కాపాడినట్లే.


ఎస్వీగిరి కాలనీలో ఎండిపోయిన వేప చెట్టు


ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో ఎండిపోయిన వేప చెట్టు


రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
టీడీపీ జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులు

# వెంకటాద్రిపల్లి- విరుపాపల్లి రోడ్డుకు మహార్దశ

**రూ.3.50 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు...**

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని వెంకటాద్రిపల్లి - విరుపాపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణానికి 3.50 కోట్లు నిధులు మంజూరుకు అనుమతులు లభించినట్లు తెలిసింది. వెంకటాద్రిపల్లి- విరపాపల్లి గ్రామాల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా కంకర తేలి రోడ్డు అద్వానంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు కళ్యాణదుర్గం ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడేవారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని టీడీపీ నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సోదరులు పయ్యావుల శ్రీనివాసులకు విన్నవించారు. పయ్యావుల సోదరులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వెంకటాద్రిపల్లి- విరుపాపల్లి గ్రామాల మధ్య తార రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 3.50కోట్లు నిధుల మంజూరుకు అనుమతులు లభించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. తార రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయించిన పయ్యావుల సోదరులకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

# శీర్పి, బెళుగుప్ప చెరువులకు రెండవసారి నీరు విడుదల

**మంత్రి పయ్యావుల కేశవ్,పయ్యావుల శ్రీనివాసులకు కృతజ్ఞతలు..**

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రెండవసారి శీర్పి, బెళుగుప్ప చెరువులకు కృష్ణాజిల్లాలను వదిలారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సోదరులు టిడిపి జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో గురువారం అంకంపల్లి వద్ద గల 10వ పంపు హౌస్ నుండి ఒక మోటార్ తో శీర్పి, బెళుగుప్ప చెరువులకు అధికారులు నీటిని విడుదల చేశారు. శీర్పి, బెళుగుప్ప చెరువులలో కృష్ణా జలాలు సమృద్ధిగా చేరుతుండడంతో భూగర్భ జలాలు పెరిగి ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా, రైతులకు తోటల్లో పంటలు పండించుకోవడానికి అనువుగా ఏర్పడింది. ఈ సీజన్ లో రెండవసారి శీర్పి, బెళుగుప్ప చెరువులకు నీటిని వదిలేందుకు కృషి చేసిన మంత్రి పయవల కేశవ్, సోదరులు పయ్యావుల శ్రీనివాసులకు రైతులు అభినందనలు తెలిపారు..





అంకంపల్లి వద్ద గల 10వ పంపు హౌస్ నుంచి ఒక మోటర్‌తో శీర్పి, బెళుగుప్ప చెరువులకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

# గుడిపాడు, చల్లబసాయపల్లె గ్రామాల్లో నేడు యూరియా పంపిణీ

**ఏవో అమర్నాథరెడ్డి..**

**దువ్వూరు (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులకు అవసరమైన యూరియాను నేడు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాగు పనుల దృష్ట్యా రైతులకు ఎరువుల ఇబ్బంది కలగకుండా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నుండే ఆయా రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ ప్రారంభం కానుంది.గుడిపాడు రైతు సేవా కేంద్రం లో గుడిపాడు మరియు కటికపల్లె గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేస్తారు.చల్లబసాయపల్లె రైతు సేవా కేంద్రంలో చల్లబసాయపల్లె మరియు మనేరంపల్లె గ్రామాలకు చెందిన రైతులు యూరియా పొందవచ్చు. యూరియా కావాల్సిన రైతులు తప్పనిసరిగా తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని ఏఓ సూచించారు.



# 10న అమరాపురం మండల సర్వసభ్య సమావేశం

**అమరాపురం ఎంపీడీవో రామారావు..**

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**
ఈనెల 10న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామారావు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపిటిసి లు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, శాఖల వారీగా నివేదికతో 10 . 30 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.



# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గుడిబండ (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
మండల పరిధిలోని ముదిగుబ్బ గ్రామలు చెందిన లక్ష్మమ్మ( 50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మమ్మ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తనకున్న పొలంలో చింతకాయలు కోసి దానిని శుభ్రం చేసుకుని చింతపండును హిందూపురం మార్కెట్ కు ఆటలో తీసుకెళు ుండగా పరిగి చెరువు వద్ద ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడడంతో తలకు బలమైన దెబ్బ తగిలి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.


లక్ష్మమ్మ(పాత చిత్రం)

ఇదిలా ఉండగా ఆమె భర్త రాజగోపాల్ గత పది రోజుల క్రితం విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. లక్ష్మమ్మ రాజగోపాల్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. తమ తల్లిదండ్రులు వివిధ కారణాలు రిత్య ప్రమాదంలో మరణించడంతో పిల్లలు ఆనాధులయ్యారు. ఈ పరిస్థితులను చూసి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ తోడుగా తల్లిదండ్రులు లేకపోవడంతో ఆ పిల్లల బాధలు చూడలేక గ్రామంలో పలువురి కంటిలో నీళ్లు వచ్చాయి. అనాధులైన పిల్లలను ప్రజాప్రతితులు స్పందించి వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

# నేడు అగళిలో ఉచిత కంటి వైద్యశిబిరం

### సద్వినియోగం చేసుకోండి.. జడ్పీటీసీ ఉమేష్

అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆర్డిటి ఆడిటోరియంలో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి ఉమేష్ మండలంలోని అన్ని గ్రామాల్లో అలాగే సరిహద్దులో గల రొళ్ళ మండలంలోని గ్రామాలలో బుధవారం, గురువారం రెండు రోజులుగా ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. సంవత్సరంలో రెండు, మూడు సార్లు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అవసరం వున్న వారికి బెంగుళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి లో ఉచితంగానే శస్త్ర చికిత్స లు చేయించడానికి కృషి చేస్తున్నారు.గత రెండు సంవత్సరాలుగా దాదాపు 500 మందికి పైగా కంటి శస్త్ర చికిత్సలు చేయించినట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమున్న రోగులకు బెంగుళూరు శంకర్ కంటి ఆసుపత్రి కి శస్త్ర చికిత్స లకు ప్రత్యేక బస్ లో తీసుకెళతారని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి వైద్యపరీక్షలు నిర్వహించడం మండల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.కంటి వైద్యశిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు రెండు పాస్ ఫొటో సైజ్ ఫొటోలు, మొబైల్ వెంట తీసుకుని రావాలని జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు.

# పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

### పెండింగ్ కేసుల పరిష్కారంపై స్పష్టమైన ఆదేశాలు.. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ..

పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తుల పురోగతి వంటి అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో నేరాల పరిస్థితులపై డీఎస్పీతో చర్చించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, తరచూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు డ్రోన్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పేకాట, గంజాయి, మహిళలపై నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.
డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ప్రాపర్టీ కేసులను వేగంగా చేధించి రికవరీలు చేయాలని ఆదేశించారు. నేరం చేసినవారికి కోర్టుల్లో శిక్ష పడేలా దర్యాప్తులు పకడ్బందీగా జరగాలని స్పష్టం చేశారు. విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, బాధితులు పోలీసులను ఆశ్రయించినప్పుడు తక్షణమే సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. పోలీసు సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ విజయ్ కుమార్, సీసీ చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పుట్టపర్తి డిఎస్పి కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్


బాహుబలి చార్ట్. దారం బంతి ఆట.

# విజన్ లక్ష్యంపై ముగిసిన శిక్షణ కార్యక్రమం

### ఏపిఎం ముత్యాలప్ప ..

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
అమరాపురం హేమ మండల సమైక్య కార్యాలయంలో గురువారం ఏ. పి ఎం. ముత్యాలమ్మ, అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు గిరిజమ్మ, కోశాధికారి సుమ ఆధ్వర్యంలో 4 రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆరోగ్యం సూచికలో రక్తహీనత లేని గ్రామాలను ఏర్పాటు చేసుకోవడం, మాత శిశు నరనాడాలని తగ్గించడం, కిషోర్ బాలికలు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వాడే విధానాలు ,పోషించడం, నివారించడం, విద్య 6-14 సంవత్సరాలు బడి ఈడు పిల్లలను బడిలో ఉంచడం, డ్రాపోర్టులు తగ్గించడం మహిళల అక్షరాశ్యత శాతం పెంచడం, డిజిటల్ నేషన్‌పై అవగాహన కల్పించి అన్ని రంగాలలో ఆన్లైన్ వ్యవస్థను పెంచడం, సామజిక అంశాలు ఉపాధి వ్యవసాయం నైపణ్యాభివృద్ధి ప్రవర్తనలో మార్పు, ప్రభుత్వం నుండి అన్ని ప్రభుత్వ శాఖల ఆలోచనలు భాగంగా ప్రతి మహిళకు వారికి ఉన్న వ్యాపారాలను అభివృద్ధి చేయడం, టైలరింగ్ ఎంబ్రాయిడింగ్, అన్ని రకాల చేపట్టే విధంగా పోషించడం, వ్యవసాయం మండలంలో కొంతమంది రైతులతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఆధునిక పనిముట్లు ద్వారా వ్యవసాయ యాంత్రికరణ ద్వారా వ్యవసాయ యాంత్రికరణ చేయడం, ఎలక్ట్రానిక్ అంశాలపై అవగాహన, కంప్యూటర్ , పబ్లిక్ ట్విట్టర్ వివిధ రకాల వృత్తులపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించి వారి నైపుణ్యాభివృద్ధిని వెలికితీసి వృద్ధిపరచడం, . సామాజిక అంశాలు బాల్య కార్మిక వ్యవస్థ నిర్మూలించడం, బాల్యవివాహాలు తగ్గించడం, మూఢనమ్మకాలు, జూదం, దురావాట్లపై అవగాహన కల్పించడం, వీటిపై తర్ఫీదు ఇచ్చి బాహుబలి చార్టుల ద్వారా గ్రామ సంఘం లీడర్స్‌లకు అవగాహన కల్పించారు. గ్రామ సంఘం లీడర్లు తమ గ్రామ సంఘ పరిధిలో విజన్ బిల్డింగ్ అంశాలను పూర్తిగా తెలియపరచి రాబోవు ఐదు సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో నాగరాజు,సీసీ టీ ఓ టీ డి భాస్కర సిసి గోపాలకృష్ణ సీ.సీ వీరేశ్ సిసి మండల సమాఖ్య అకౌంటెంట్ , వివోఏలు పాల్గొన్నారు.


గ్రామ సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం ముత్యాలప్ప



చార్ట్ ద్వారా వివరిస్తున్న దృశ్యం


శిక్షణ ఇస్తున్న టిఓటి సి సి నాగరాజు, టిఓటి .ఏ ముత్యాలప్ప, పాల్గొన్న గ్రామ సంఘం బిల్డర్లు


సుజాతను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

# బదిలీపై వెళ్తున్న ఏవో సుజాతకు ఘన సన్మానం

### జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రశంసలు..

పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఏఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఏవోగా కడప జిల్లాకు బదిలీపై వెళ్తున్న సుజాతను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఘనంగా సత్కరించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సుజాత అడ్మినిస్ట్రేటివ్ పరంగా సమర్థవంతంగా విధులు నిర్వహించారని ప్రశంసించారు. విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. పదోన్నతిపై కడప జిల్లాకు వెళ్తున్న సుజాత అక్కడ కూడా అదే స్థాయిలో సమర్థంగా పనిచేసి సంస్థకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సుజాత మాట్లాడుతూ తాను నాలుగు సంవత్సరాల పాటు పుట్టపర్తి జిల్లాలో విధులు నిర్వహించానని తెలిపారు. ఈ కాలంలో తోటి సిబ్బంది అందరూ కుటుంబ సభ్యుల్లా సహకరించారని పేర్కొంటూ, అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు సిఐలు, డిపిఓ సిబ్బంది సుజాత అందించిన సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆమెకు మెమొంటోను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఇందిరా, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సూపర్డెంట్లు సరస్వతి, ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు, సిఐలు శ్రీనివాసులు, లక్ష్మీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆర్ ఐలు వలి మహేష్, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఎస్బి, డిపిఓ, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# తపాలా శాఖలో ఉత్తమ సేవలకు గుర్తింపు

### హల్కూర్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మధుసూదన్ వలస శివలింగప్పకు ఘన సన్మానం..

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
తపాలా శాఖలో ఉత్తమ సేవలు అందిస్తున్న సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలంలోని హల్కూర్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మధుసూదన్, వలస పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ శివలింగప్పలకు తపాలా శాఖ ఉన్నంతధికారులు చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు, వారిని ఘనంగా సన్మానించారు. అమరాపురం, హేమావతి తపాలా శాఖ కార్యాలయాలలో గ్రామీణ జీవిత బీమా పాలసీల సేకరణలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు హల్కూర్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మధుసూదన్, వలస పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ శివలింగప్పలను పోస్టల్ శాఖ అధికారులు, సిబ్బంది కలసి తపాలా కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అమరాపురం మండలం హేమావతి పంచాయితీ కేంద్రంలోని సబ్ పోస్టాఫీసులో జరిగిన సన్మాన సభ కార్యక్రమంలో హిందూపురం పోస్టల్ ఎస్పీ రెడ్డి బాషా, అసిస్టెంట్ సూపరెంట్ మల్లికార్జున,మడకశిర పోస్టల్ ఇన్స్పెక్టర్ జిలాన్ భాష, తపాలా బీమా డెవలప్మెంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, సబ్ పోస్టుమాస్టర్లు చౌడన్న, రాజశేఖర్, ఉమేష్ నాయక్, తదితరుల చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు అవార్డును అందజేశారు. మడకశిర డివిజన్ పరిధిలో అమరాపురం పోస్టల్ బీమా పథకాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడంలో,పెద్ద సంఖ్యలో పాలసీలు చేయించడంలో హల్కూర్ మధుసూదన్ తీసుకున్న చొరవను అధికారులు ప్రత్యేకంగా ప్రశంసించారు . ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు పోస్టల్ బీమా ప్రయోజనాలను అందించడమే, లక్ష్యాలను అధిగమించడంలో తాను ముందంజలో ఉన్నానని ఎస్పీ రెడ్డి బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, గ్రామీణ తపాలా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న హల్కూర్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ మధుసూదన్


ప్రశంసా పత్రం అందుకుంటున్న వలస పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ శివలింగప్ప

# అనంతరాజు.. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా...

### జడ్పీటీసీ హోదాలో ఒక రూపాయి అయినా తెచ్చావా.. నీవా కూటమి ప్రభుతాన్ని విమర్శించడం.. టిడిపి నాయకులు ..

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
ఐదేళ్లు వైకాపా ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులు, ఈ 19 నెలలు కూటమి ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధంగా వున్నావా అనంతరాజు అని మండల టిడిపి నాయకులు సవాల్ విసిరారు. స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో గురువారం మండల పార్టీ అధ్యక్షులు జికె ఈరన్న, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ మంజునాథ్, మండల బిసి సెల్ అధ్యక్షులు నాగరాజు,వైస్ సర్పంచ్ రాజు, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, నాయకులు నాగరాజు ు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో తమ పార్టీకి చెందిన ఎంపీటీసీ లు లేరని ఎంపీపీ ఎన్నికలకు కుట్రలు, కుంతత్రాలు పన్నాల్సిన అవసరం తమకు లేదన్నారు. వైకాపా ఎంపీపీని గద్దెదింపి ఇండిపెండెంట్‌గా గెలిచిన ఎంపీటీసీని ఎంపీపీగా చేయడానికి మీరే పన్నాగం పన్నిన విషయం ప్రపంచానికి తెలుసన్నారు.
వారికి మద్దతుగా నియోజకవర్గంలోని వైకాపా నాయకులందరూ కలిసారని వారికి సిగ్గుఉండాలని హితువు పలికారు.
టిడిపి సానుభూతి ఓట్ల తో ఇండిపెండెంట్‌గా గెలిచినా జడ్పీటీసీ అనంతరాజు కూటమి ప్రభుత్వంపై మాట్లాడే అర్హత, లేదన్నారు. మడకశిర నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి 216 బోర్లు తవ్వించిన ఘనత ఎమ్మెల్యే ఎం ఎస్ రాజుకే దక్కుతుందన్నారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండింటి సమానంగా తీసుకొందన్నారు.ప్రతి గ్రామం లోను సిసి రోడ్లు బి టి రోడ్ నిర్మించారన్నారు.
గత ఐదేళ్లలో పెన్షన్ 250 చొప్పున 1000 పెంచగా 2014లో 200 పెన్షన్‌ను 1000 రూపాయలకు పెంచి ఆ తరువాత 2 వేల రూపాయలకు పెంచారన్నారు. ప్రస్తుతం ఒకేసారి 1000 రూపాయలు పెంచి నాలుగు వేలు రూపాయలు ఇస్తున్నామన్నారు. 800 మందికి పైగా 4 కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలో పెన్షన్ పెంచి ఇవ్వడం, అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు 20 వేల రూపాయలు, ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదివితే అంతమందికి తల్లికి వందనం నిధులు జమా చేయడం జరిగిందన్నారు. మహిళా లకు ఉచిత బస్ సౌకర్యం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు.
అమరాపురంలో వక్క మార్కెట్, గుడిబండ మండలంలో 3 వేల కోట్లతో సోలార్ ఏర్పాటు, మడకశిర మందుగుండు పిరాంగి పరిశ్రమను నెలకొల్పడానికి త్వరలో నే శంకుస్థాపన చేశారన్నారు.
చీపులేటి వద్ద ఏర్పాటు చేసిన గార్మెంట్ ప్రారంభించడానికి మీ ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేయగా ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గార్మెంట్ ను ప్రారంభించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. ఇవన్నీ కళ్లాముందు కనపడుతున్న కళ్లు లేని కాబోధులు మాట్లాడటం సరికాదన్నారు.
వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడిన మాటలను తిప్పికొట్టారు. త్వరలో జరిగే స్థానిక సంస్థగత ఎన్నికల్లో జడ్పీటీసీ, మండల పరిషత్, సర్పంచ్ లు ఎంపీటీసీ స్థానాలు అన్నింటి గెలిచి తీరుతామన్నారు. ఈకార్యక్రమంలో యువ నాయకులు ఆనంద్, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, మాజీ ఎంపీపీ క్రిష్ణప్ప,టి ఎన్ టి యూ సి ప్రధాన కార్యదర్శి ఉమేష్, పంచాయతీ అధ్యక్షులు నాగేంద్ర,డీలర్ నరసప్ప,నాయకులు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

# దేశానికి గర్వకారణం అంధుల క్రికెట్ కెప్టెన్ దీపిక

### కెనరా బ్యాంక్ మేనేజర్ సూర్య దేవానాయక్..

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :
దేశానికి గర్వకారణమైన అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికను అమరాపురం కెనరా బ్యాంక్ మేనేజర్ సూర్య దేవా నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. అంధుల మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టును విజేతగా నిలిపి దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన ఆమె ప్రతిభకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. దాదాపు గంటకు పైగా స్నేహపూర్వకంగా జరిగిన సంభాషణలో, ఆమె క్రికెట్ ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, క్రికెట్ పట్ల ఆమెకు అవకాశాలు ఎలా లభించాయనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కెప్టెన్ దీపిక కుటుంబ సభ్యులతో పాటు, అతిథుల కుటుంబ సభ్యులు కూడా వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. కెప్టెన్ దీపిక నివాసం ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న కెనరా బ్యాంక్, అమరాపురం శాఖకు సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉండటం విశేషం. ముందస్తు అపాయింట్‌మెంట్‌తో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా కెప్టెన్ దీపిక ఆత్మీయతతో జ్ఞాపకార్థంగా ఒక క్రికెట్ బంతిని కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ నూన్సా వత్ సూర్య దేవ నాయక్‌కు బహుమతిగా అందజేశారు. అనంతరం దీపిక స్వయంగా కెనరా బ్యాంక్, అమరాపురం శాఖను సందర్శించి, తన పేరుతో కెనరా ఏంజెల్ ఖాతా ప్రారంభించారు. అదేవిధంగా ఆమె తల్లిదండ్రులకు కూడా అదే శాఖలో ఖాతాలు ప్రారంభించారు. కెప్టెన్ దీపిక ప్రతిభను గౌరవిస్తూ దేశ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు సత్కరించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులు ఆమెను అభినందించారు. ఇలాంటి గొప్ప క్రీడాకారిణిని ప్రత్యక్షంగా కలవడం, అలాగే బ్యాంకు శాఖను దీపిక స్వయంగా సందర్శించడం, ఖాతాను ప్రారంభించడం, బ్యాంకు సిబ్బంది కి మరియు శాఖకు గర్వకారణం అని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు ఎంతో ఆనందం, గర్వాన్ని కలిగించిందని మేనేజర్ సూర్య దేవా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎన్. సూర్యదేవ నాయక్, అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ఇన్సూరెన్స్ ఏజెన్సీ రవి, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.




దీపిక కుటుంబ సభ్యులతో కెనరా బ్యాంక్ మేనేజర్ సూర్య దేవా నాయక్ , అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ఇన్సూరెన్స్ ఏజెన్సీ రవి. అకౌంట్ పుస్తకాన్ని అందుకుంటున్న దృశ్యం

# జాతరలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

### కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి ..

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

ఈనెల 7 తేదీన జరిగే ఎల్లమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని, జాతరలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కోసిగి రేణుక యల్లమ్మ తల్లి జాతర సందర్భంగా, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, జాతరను శాంతియుతంగా, సవ్యంగా మరియు భద్రతతో నిర్వహించుటకు యెమ్మిగనూరు డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో కోసిగి సర్కిల్ సీఐ మంజునాథ్ యస్ఐ పర్యవేక్షణలో పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయబడిని ఆయన తెలిపారు



జాతర సమయంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నియంత్రణ, దొంగతనాల నివారణ, మహిళలు, వృద్ధులు, పిల్లల రక్షణతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోబడినవి. జాతర పరిసర ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు, మొబైల్ గస్తీ, ట్రాఫిక్ సిబ్బందిని నియమించామన్నారు. భక్తుల రాకపోకలను సజావుగా నిర్వహించుటకు ప్రత్యేక ట్రాఫిక్ ప్లాన్ అమలు చేయబడుచున్నది. రహదారులపై అనవసర వాహనాల నిలుపుదల జరగకుండా కఠినంగా నియంత్రణ చేపట్టబడినది. జాతర ప్రాంగణం పరిసరాల్లో నిరంతర నిఘా కొనసాగించుటకు పోలీస్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, భక్తులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థల సభ్యులు అందరూ పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతరను విజయవంతం చేయవలసిందిగా పోలీస్ డిపార్ట్మెంట్ తరపున విజ్ఞప్తి చేయడమైనదని తెలిపారు. . జాతరకు వచ్చే భక్తులు తమ వాహనాలను పోలీసులు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే క్రమపద్ధతిలో నిలిపివేయాలన్నారు. ప్రధాన రహదారులు, ఆలయ పరిసర ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేయరాదు. అలా చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండి, నగదు, మొబైల్ ఫోన్లు, బంగారు ఆభరణాలు వంటి విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవలెనని తెలిపారు. మహిళలు, వృద్ధులు, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, రద్దీ ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనాల్లో వచ్చి వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించవలెనని తెలిపారు.

రథోత్సవం సమయంలో అధిక రద్దీ ఉండే అవకాశమున్నందున, భక్తులు అందరూ ఓర్పుతో, శాంతంగా ఉండి, తోసుకోవడం, గందరగోళం సృష్టించకుండా పోలీస్ సిబ్బంది సూచనలను అనుసరించవలెనన్నారు మద్యం సేవించడం, గొడవలకు పాల్పడటం, అశాంతి కలిగించే చర్యలు పూర్తిగా నిషేధించబడినవని తెలిపారు అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా పరిస్థితులు కనిపించినచో వెంటనే సమీప పోలీస్ సిబ్బందికి లేదా కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. జాతర నిర్వహణలో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో సహకరించి, వారి ఆదేశాలను తప్పనిసరిగా పాటించవలెనని తెలిపారు. అందరూ పోలీస్ శాఖ సూచనలను గౌరవిస్తూ, పరస్పర సహకారంతో జాతరను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, విజయవంతంగా నిర్వహించవలసిందిగా పోలీస్ శాఖ తరపున కోరడమైనదని రమేష్ రెడ్డి తెలిపారు

# టీడీపీ జిల్లా కమిటీలో పెద్దకడబూరు నుంచి ఇద్దరికి చోటు

### జిల్లా అధికార ప్రతినిధిగా నరవ శశిరేఖ..
### జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోడిగుడ్ల ఏసేపు ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

టీడీపీ జిల్లా కమిటీలో పెద్దకడబూరు నుంచి ఇద్దరికి చోటు దక్కడంతో గురువారం కర్నూలు నగరంలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పెద్దకడబూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా టీడీపీ సీనియర్ నాయకులు కోడిగుడ్ల ఏసేపు టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మతోపాటు అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో టీడీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సైనికుల్లా పని చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పని తీరును చూసి ఓర్వలేక వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొడతామన్నారు.



టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖను అభినందిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

అనంతరం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపులకు మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, ఎన్. హనుమంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పెద్దకడబూరు మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపును అభినందిస్తున్న నాయకులు



టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖను అభినందిస్తున్న టీడీపీ నాయకులు



రైలు ఢీకొని మృతి చెందిన చిరుతపులి

# రైలు ఢీకొని చిరుతపులి మృతి

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

కోసిగి-కుప్పగల్లు రైల్వే స్టేషన్ల మధ్య గురువారంనాడు గుర్తు తెలియని రైలు ఢీకొని చిరుతపులి ✓ అక్కడికక్కడే చనిపోయినట్లు ఆదోని రైల్వే హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య తెలిపారు. రైల్వే సిబ్బంది అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైలు ఢీకొని రెండు మృతి చెందిన చిరుతపులిని ఆదోని ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఫారెస్ట్ అధికారులు నిబంధనల ప్రకారం మిగతా కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిసింది..కాగా కోసిగి ప్రాంతంలో గల కొండలలో చాలా రోజుల నుండి చిరుతపులులు స్థావరాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటూ ఆచుట్టుపక్కల ఆహారం కోసం సంచరిస్తూ ఉంటాయి. కోసిగి -కుప్పగల్లు రైల్వేస్టేషన్ల మధ్య అడవి ఉండడంతో ఆహారం కోసం సంచరిస్తూ ఉంటాయి.




మాట్లాడుతున్న ఎస్సే రమేష్ రెడ్డి

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

కోసిగిలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మిగనూరు ఆర్‌కె కంటి హాస్పిటల్ డాక్టర్ హేమంత్ కుమార్,, కోసిగి సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో కోసిగి నందు శ్రీ మార్కండేయ ఫంక్షన్ హాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత శిబిరానికి ముఖ్య అతిథులుగా ఎస్సై రమేష్ రెడ్డి, పాల్గొన్నారు. డాక్టర్ హేమంత్ కుమార్ ఎస్సై రమేష్ రెడ్డి మాట్లాడుతూ కోసిగి ప్రాంతంలో ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 200 మంది ఉచిత వైద్య శిబిరానికి రావడంతో విశేష స్పందన లభించిందని వారు అన్నారు. ఎన్టీఆర్ వైద్య సదుపాయం కింద 60 మందికి ఉచిత కంటి ఆపరేషన్ కు గుర్తించారు. మిగత వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్లు లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ నజీర్, గోపాల్, జంబన్న,శరణ, =ఖ కంటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

# ఘనంగా చాముండేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

### నేడు ఘనంగా ప్రతిష్ఠ

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

మండల చెర్లోపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో గురువారం నుంచి రెండు రోజులపాటు జరిగే చాముండేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమంలో భాగంగా సాయంత్రం గంగాపూజ తో మొదలై వీరాగాసే నృత్యం తో అమ్మవారిని ఎద్దుల బండిపై గ్రామం లో ఊరేగింపు నిర్వహించారు. 6 న శుక్రవారం ఉదయం 5గంటల నుండి 5:30 వరకు ప్రాణప్రాతిస్టాపన కార్యక్రమం చేపట్టడానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుగణపతి ప్రార్థన, దేవానంది, పంచాగవ్య మేళన, అంకురార్పణ, కళాశ స్థాపన, నవగ్రహ ఆరాధన, అనంతరం మహమంగళరాతి ఉంటుందన్నారు. సాయంత్రం కళాశారాధన, ప్రాణప్రతిష్ట, మంగళారతి, ఆదిత్యాది గణపతి హోమం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రాణప్రాతిస్టాపన కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.



వీరాగాసే నృత్యం చేసున్న దృశ్యం



కళశ పూజ నిర్వహించిన దృశ్యం
ఎద్దుల బండపై చాముండేశ్వరి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం.

# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

### ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడబూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకాన్ని మహాత్మాగాంధీ పేరుతో కొనసాగించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం దేశంలోని కోట్లాది గ్రామీణ పేదల జీవనాధారంగా నిలిచిందన్నారు. గాంధీజీ ఆశయాలకు ప్రతీకగా ఉన్న ఈ పథకాన్ని బలహీనపరచాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పథకానికి "రామ్‌జీ" పేరును జోడించడం తీవ్రంగా ఖండించదగిన చర్యగా విమర్శించారు. గాంధీజీ పేరును తొలగించే ప్రయత్నం దేశ ప్రజాస్వామ్య చరిత్రను వక్రీకరించడమే కాకుండా, గ్రామీణ పేదలపై మరో దాడిగా అభివర్ణించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, పనిదినాలను తగ్గిస్తూ, వేతనాలను సకాలంలో చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. 2005లో ప్రారంభమైన ఉపాధి హామీ పథకానికి తప్పనిసరిగా మహాత్మాగాంధీ పేరు కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం చేర్చిన "రామ్‌జీ" పేరును తక్షణమే రద్దు చేయాలన్నారు. గ్రామీణ కార్మికులకు సంవత్సరానికి కనీసం 200 రోజులు పని కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని కోరారు. ఉపాధి పనుల సమయంలో కూలీలు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయం ఇవ్వాలన్నారు. ఉపాధి పనులకు అవసరమైన పనిముట్లు ప్రభుత్వమే అందించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బకాయిలు వెంటనే చెల్లించాలని తెలిపారు. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు నాణ్యమైన, భద్రతతో కూడిన పనులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను వెంటనే అమలు చేయకపోతే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గాంధీజీ పేరును తొలగించే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని వారు స్పష్టం చేశారు. అనంతరం నౌలేకల్ గ్రామ శివారుల్లో ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు, సీఐటీయు మండల కార్యదర్శి ఉప్పర ఈరన్న, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు



నౌలేకల్ గ్రామ శివారుల్లో కూలీలతో సమావేశమైన నాయకులు

# ఘనంగా టిడిపి పార్లమెంట్ కమిటీ ప్రమాణ స్వీకారం

### అధ్యక్షురాలిగా గుడిసె కృష్ణమ్మ
### ప్రధానకార్యదర్శిగా నాగరాజు
### ఉపాధ్యక్షులుగా ఉలిగయ్య ప్రమాణ స్వీకారం..

**కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

కర్నూలు ఎం.ఆర్.సి కన్వెన్షన్ హాల్‌లో తెదేపా పార్లమెంట్ కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. అధ్యక్షురాలిగా గుడిసె కృష్ణమ్మ, ప్రధానకార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఉలిగయ్య కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా మంత్రి టి.జి భరత్, ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, రాఘవేంద్ర రెడ్డి, వైకుంఠం జ్యోతి కుడ చైర్మన్ నాయకులు సోమిశెట్టి, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని, జిల్లాలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు భారీ మెజారిటీతో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. యువతను, మహిళలను రాజకీయంగా ప్రోత్సహించి అందరికీ అందుబాటులో ఉంటూ పనిచేస్తామన్నారు.

తమ మీద నమ్మకంతో కష్టాన్ని గుర్తించి ఇలాంటి ఉన్నతమైన పదవి ఇచ్చినందుకు సీఎం నారాచంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం నియోజకవర్గం తెలుగుతమ్ముళు రామకృష్ణ రెడ్డి, యువ నాయకులు సతీష్ నాయుడు, పట్టాభి, ముత్తు రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, నరవ శశిరేఖ, హనుమంతురెడ్డి, విజయకుమార్, ఏసోభు, మండల అధ్యక్షులు రామిరెడ్డి, గోపాల్ రెడ్డి, మల్లికార్జున, సురేష్ నాయుడు, బోయ మారెప్ప, రామలింగ , కురువ వీరేష్, కాత్రికి చంద్ర, కురువ ఈరన్న, నర్సారెడ్డి, అయ్యన్న, హరివిలి వీరేష్, మాలపల్లి వెంకటేష్, లక్ష్మయ్య, గిరి, ముకన్న, మొదలగు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చూడి ఉల్లిగయ్యను కలిసిన కౌతాళం మండలం టిడిపి నాయకులు



కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలుగా గుడిసె కృష్ణమ్మ, ఉపాధ్యక్షులుగా చూడి ఉల్లిగయ్య ప్రమాణస్వీకారం సందర్భంగా గజమాలతో సన్మానం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు. పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

# కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ నూతన గృహ ప్రవేశ వేడుకలు

### పాల్గొన్న నాయకులు వై. సీతారామ రెడ్డి ,
### వై ధరణి రెడ్డి , దేశాయ్ ప్రహల్లాద ఆచారి ..

**కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 5 :**

కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ నూతన గృహ ప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాంపురం రెడ్డీస్ వై. లిసీతారామ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వై. లిసీతారామ రెడ్డి , మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగరెడ్డి తనయుడు వై ధరణి రెడ్డి , కౌతాళం మండలం అధ్యక్షులు దేశాయ్ ప్రహల్లాద ఆచారి పాల్గొన్నారు. వీరిని ఈ సందర్భంగా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కో- అబ్షన్ మెంబర్ మాబుసాబ్ వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, వైస్ సర్పంచ్ సక్రీ తిక్కయ్య, ఎమ్మెల్యే పిఏ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ అవతారం. పాల్ రెడ్డి, కుంట నహల్. నరసింహ, భీమ యూత్ లీడర్ భీమేష్, గణపతి రాజు, వడ్డే చిన్న , లీడర్ , ఉమాపతి, నరసింహ, రామక్రిష్ణ, వడ్డే , సక్రీ శ్రీరామ్, మద్రి స్వామి, ఎన్టీఆర్ నగర్ భాషా మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ కౌతాళం మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు సర్పంచ్ లు ఎంపీటీసీలు జడ్పీటీసీలు ఎంపీపీలు వివిధ గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న వై సీతారాం రెడ్డి




కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్ నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న వై సీతారాం రెడ్డి , వై ధరణి రెడ్డి , దేశాయ్ ప్రహల్లాద ఆచారి .

# 16ఏళ్లలోపు వారిని మీడియాకు దూరం చేయాలి



## అట్లీ అల్లుఅర్జున్ మూవీలో రష్మిక

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం ఎఎ22 ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటు తున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భ్‌లతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ,రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ , రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ చిత్రంలో రష్మిక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆమె కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రలో, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యూనివర్స్ కాన్సెప్ట్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతుండగా, అల్లు అర్జున్ మల్టిపుల్ క్యారెక్టర్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.



## అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై సోనూసూద్ ఆందోళన.....

సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువతను, చిన్నారులను పెను ప్రమాదంలోకి నెడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషాద ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ తీవ్రంగా స్పందించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించాలని గతంలోనే కోరిన ఆయన.. ఈ తాజా ఘటన నేపథ్యంలో మరోసారి కేంద్ర ప్రభుత్వానికి తన విజ్ఞప్తిని బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.'ఘజియాబాద్‌లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వారు హింసకో, పేదరికానికో బలవ్వలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం సృష్టించిన కనిపించని ఒత్తిడికి బలైపోయారు. నేను మళ్ళీ చెబుతున్నాను.. చదువు కోసం తప్ప, మిగతా అన్ని విషయాల్లో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లను నిషేధించాలి. బాల్యానికి కావాల్సింది సరైన మార్గదర్శకత్వం, ప్రేమ.. అంతే కానీ అల్గారిథమ్స్, స్క్రీన్లు కాదు. ఇది ఎవరినో నిందించడం కోసం కాదు, మన పిల్లలను కాపాడుకోవడం కోసం చేస్తున్న విజ్ఞప్తి. ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు.. ఇప్పుడైనా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది'. అంటూ సోనుసూద్ రాసుకొచ్చాడు.

## మరో జన్మంటూ వుంటే దర్శకుడిగా పుట్టను.. గుణశేఖర్



బలమైన కథలు, భారీ సెట్స్‌లకు పెట్టింది పేరు దర్శకుడు గుణశేఖర్. 'బాల రామాయణం' 'చూడాలని ఉంది', 'ఒక్కడు'లాంటి సినిమాలతో సత్తా చాటిన ఆయన ఇప్పుడు ఈతరం కథతో 'యుఫోరియా' ను తెరకెక్కించారు. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా 'మరో జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను' అని ఇటీవల వ్యాఖ్యానించారు. 'డైరెక్టర్‌గా ప్రతిభ చాటిన మీరు అలా ఎందుకు అనాల్సి వచ్చింది? ట్రోలింగ్ కారణమా?' అని గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓ విలేకరి ప్రశ్నించగా.. గుణశేఖర్ సమాధాన మిచ్చారు.ట్రోలింగ్ సమస్య కాదు. అది ఎప్పుడూ ఉంటుంది. ఓ దర్శకుడి ఒత్తిడి గురించి చెబుతూ ఆ మాట అన్నాను. డైరెక్టర్ సీటులో కూర్చున్న ఎవరికైనా స్ట్రెస్ తప్పదు. ఏ ఉద్యోగంలోనైనా తృప్తి ఉంటుందిగానీ దర్శకులకు ఉండదు. తృప్తి ఉంటేనే కంటినిండా నిద్రపడుతుంది. అలాంటి నిద్రను 1992లో వదిలేసిన నేను ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నా. మళ్లీ హాయిగా వచ్చే జన్మలోనే నిద్రపోవాలన్న ఉద్దేశంతో డైరెక్టర్‌గా పుట్టను అని అన్నాను' అని వివరణ ఇచ్చారు. భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. తాజా ప్రెస్‌మీట్‌లో భూమిక, గుణశేఖర్ కుమార్తె, నిర్మాత నీలిమ గుణ తదితరులు పాల్గొన్నారు. విలేకరులతో 'యుఫోరియా' టీమ్ ఎ ం చ ం క ం న విశేషాలివీ..హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటనను యథాతథంగా తెరపైకి తీసుకొచ్చారన్న టాక్ వినిపిస్తోంది. ముందుగా కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీయాలని నిర్ణయించుకున్నా. కానీ, కథ రాయడం మొదలుపెట్టాక అన్ని నగరాల్లోనూ, విదేశాల్లోనూ అలాంటి ఘటనలు జరిగాయి. ఈ సినిమాలోని సీన్స్ వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలను గుర్తుచేస్తాయన్నారు.



## బన్సాలీ మూవీ.. దో దివానే షెహర్‌మే

బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్దాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్ని) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్దాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యవార్ తెరకెక్కించాడు. తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.

## నేటి నుంచి ఓటీటీలోకి రాజాసాబ్



నేటి నుంచి ఓటిటిలోకి రాజాసాహెబ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో వచ్చిన క్రేజీ హారర్-కామెడీ మూవీ 'ది రాజాసాబ్' ఓటీటీలోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం విడుదలైన నెల రోజుల్లోపై ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ అత్యంత భారీ ధరకు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకోగా.. ఫిబ్రవరి **6** నుంచి ఈ సినిమా జియో హాట్‌స్టార్‌లో తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే ఓటీటీ వెర్షన్‌కి సంబంధించి గుడ్ న్యూస్ తెలిపింది చిత్రయూనిట్. ఈ సినిమా ఎక్స్టెండెడ్ కట్‌తో ఓటీటీలోకి రాబోతున్నట్లు ప్రకటించింది. దీంతో థియేటర్‌లో మిస్ అయిన ప్రేక్షకులకి ఇది గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు. ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూపిస్తూ మారుతి తెరకెక్కించిన ఈ చిత్రంలో సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.